క్లుప్తంగా

మొదటి ప్రాధాన్యత ఓటుతో విజయం

మానకొండూర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య గెలుపునకు కృషిచేసిన సీపీఎస్ ఉద్యోగులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మాండ్ల భాస్కర్ అన్నారు. మంగళవారం గుండ్లపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని సీపీఎస్ ఉద్యోగులు ఏకతాటిపై గెలుపులో పాలుపంచుకోవడం అభినందనీయమని, కరీంనగర్ నియోజకవర్గ చరిత్రలో మొదటి ప్రాధాన్యత ఓటుతో విజయాన్ని కైవసం చేసుకొని చరిత్రలో నిలిచిపోయారని, కొమురయ్య గెలుపుతో సీపీఎస్ ఉద్యోగులు ఆనందంలో మునిగిపోయారని, గెలుపులో పాలుపంచుకున్న ఉపాధ్యాయులందరికీ టీపీఎస్ పక్షాన ధన్యవాదాలు తెలిపారు.

సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్న రోగులు

మానకొండూర్: గన్నేరువరం మండల కేంద్రంలోని ఆయుర్వేదిక్ వైద్యశాలకు తాళం వేసి ఉంటోందని, దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర యువజన నాయకుడు సంపతి ఉదయ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయుర్వేద వైద్యశాల ఎదుట మాట్లాడారు. వైద్యశాలకు మధ్యాహ్నం రాగా తాళం వేసి ఉందని అసహనం వ్యక్తం చేశాడు. సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, ఆయుర్వేద వైద్యానికి అలవాటు పడిన వృద్ధులు, సిబ్బంది లేక ఆయుర్వేద దవాఖాన మూసి ఉండడంతో రోగులు నానా ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి సమయపాలన పాటించని వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయుర్వేద వైద్యశాలకు డాక్టర్, ఇతర సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు.

అల్పాహారం అందజేత



అల్పాహారం అందిస్తున్న కార్యదర్శి వేణుగోపాల్

శంకరపట్నం: మండలంలోని రాజాపూర్ గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ అల్పాహారం అందించారు. ఎండల తీవ్రతతో ఈజీఎస్ పనులు చేస్తున్న కూలీలు నీరసానికి గురయ్యే అవకాశం ఉందని, మంచినీటి వసతి, నీడ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు.

చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

మానకొండూర్: గన్నేరువరం మండలంలోని జంగపల్లి గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు లబ్ధిదారులు జి. వెంకటస్వామి, బొజ్జ లక్ష్మి, కర్ర రవీందర్‌రెడ్డికి చెక్కులు అందజేశామన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు వరుకోలు వెంకట్, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి కొంకటి జయప్రకాశ్, నాయకులు మాజీ ఎంపీటీసీ అటికం రాజేశం, గుంటుక లింగయ్య, ఆంజనేయులు, బుర్ర కనకయ్య, పుర్ర రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హిందువులు ఇబ్బందిపడొద్దు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సభ్యులు

చొప్పదండి: హిందువులు హలాల్ ఆహారం తినడం మానుకోవాలని, జట్కా మాంసాన్ని మాత్రమే స్వీకరించాలని చొప్పదండి ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని దేశాయిపేటలో హిందు చైతన్య వేదిక ఆధ్వర్యంలో హలాల్ వద్దు, జట్కా ముద్దు పేరుతో ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై కృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. ఏ మతంవారు ఆ మతానికి చెందినట్టు జీవించడం సెక్యులరిజమని, హిందువులు ఆచార వ్యవహారాలను తూచా తప్పకుండా పాటించాలని కోరారు. ఇళ్లలో జరిగే వివిధ కార్యక్రమాల్లో హలాల్ చేసే మాంసం వడ్డించడం వల్ల హిందువులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక జిల్లా కన్వీనర్ ధ్యావ సంతోశ్ కుమార్, గుర్రం ఆనందరెడ్డి, గడ్డం రమేశ్, పాకాల మహేశ్, కనకం శ్రీనివాస్, ముదిగంటి సురేశ్, అశోక్, వెంకటేశ్, దండె రవీందర్, గుంట రవి, తదితరులు పాల్గొన్నారు.

షెడ్‌నెట్లతో మొక్కలు సేఫ్

- నర్సరీల్లో నీడ సౌకర్యం కల్పిస్తున్న అధికారులు



మానకొండూర్‌లోని నర్సరీలో మొక్కల సంరక్షణకు ఏర్పాటు చేసిన షెడ్‌నెట్

మానకొండూర్: ఆయా గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండి పోకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. మొక్కల కోసం షెడ్‌నెట్లు ఏర్పాటు చేస్తున్నారు. నీడ సౌకర్యంతో వేసవిలో మొక్కలు ఎండిపోకుండా ఉంటాయని, మొన్నటి వరకు నర్సరీల్లో పెట్టిన విత్తనాలు సరిగా మొలకెత్తక పోగా మళ్లీ విత్తనాలు పెడుతూ నర్సరీల్లోని మొక్కలను అభివృద్ధి చేస్తున్నారు. వేసవి సమీపిస్తుండటంతో నర్సరీల్లోని మొక్కలు ఎండి పోకుండా షెడ్ నెట్‌లు వెంటనే ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేశారు. షెడ్‌నెట్లు ఏర్పాటు పనుల్లో పంచాయతీ కార్యదర్శులు నిమగ్నమయ్యారు. రెండు నెలల క్రితమే మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. బ్యాగులు మట్టి నింపి వివిధ రకాల పండ్ల జాతి, పూలు, నీడనిచ్చే మొక్కలను పెంచుతున్నారు. నర్సరీల్లో దాదాపు అన్నీరకాల మొక్కలున్నాయి. ఒక్కో గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో 5 వేల నుంచి పదివేల పైచిలుకు మొక్కలను పెంచుతున్నారు. నర్సరీల్లో సరిపడా మొక్కలు ఉంటేనే రాబోయే హరితహారం కార్యక్రమానికి మొక్కలను పంపిణీ చేయవచ్చని, అందుకోసమే వేసవిలో మొక్కలు ఎండిపోకుండా షెడ్‌నెట్లు ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



జమ్మికుంట: బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, తదితరులు

జమ్మికుంట: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని విద్యోదయ హైస్కూల్ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు స్కూల్ నాణ్యమైన విద్యనందిస్తోందని అన్నారు. అనంతరం డ్యాన్స్, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు ఏబూషి జ్యోతి, ఆర్యన్ కౌశిక్, అకాడమిక్ డైరెక్టర్ మహాలక్ష్మి, టౌన్ సీఐ వరగంటి రవి, ఎంఈవో హేమలత, మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్ రావు, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు



చిగురుమామిడి: టీచర్లుగా విద్యార్థులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీపాఠశాల పదోతరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఆడిపాడారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌రావు మాట్లాడారు. పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ తోట శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సైదాపూర్: డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

సైదాపూర్: మండలంలోని సోమారం ఆదర్శ పాఠశాలలో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ బండారి సంపత్ కుమార్ విద్యార్థుల అకాడమిక్ ఇయర్ రిపోర్ట్, పీఎంశ్రీ తదితర అంశాలు వివరించారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ విభాగాల్లో సెలెక్టయిన విద్యార్థులను అభినందించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సైదాపూర్ ఎస్సై తిరుపతి హాజరై మాట్లాడారు. విద్యార్థులు పదో తరగతిలో పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బండికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటలు కాపాడాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రైతులు, గ్రామస్తులు

మానకొండూర్: తలాపున కాలువ ద్వారా సాగు నీరు వెళ్తున్నా కుంటలోకి చుక్క నీరు రావడం లేదని ప్రత్యేకంగా తూము ఏర్పాటు చేసి కుంటను నింపాలని మండలంలోని ఖాదర్‌గూడెం రైతులు, గ్రామస్తులు మంగళవారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. తోటపల్లి రిజర్వాయర్ నుంచి చెంజర్ల, ఖాదర్‌గూడెం వరకూ ఎంఎంఆర్ 4 ఎల్ ఉప కాలువ ఉందని, దీని ద్వారా సుమారు రెండు నెలల నుంచి సాగునీరు వెళ్తున్నా ఖాదర్‌గూడెం గ్రామ శివారులోని పటేల్ కుంటలోకి నీరు రావడం లేదని రైతులు వాపోయారు. కుంట కింద సుమారు రెండు, మూడు వందల ఆయకట్టు ఉందని, ఆయకట్టుకు కుంటనీరే జీవనాధారమని వివరించారు. సాగు నీరు రాకపోతే పంటలు ఎండిపోతాయని, ప్రతిసారి కాలువకు గండి పెట్టి కుంటలోకి సాగు నీరు తరలించి మళ్లీ గండి పూడ్చాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కుంటలోకి నేషనల్ హైవే పక్కన ఉన్న కాలువ వద్ద తూం ఏర్పాటు చేసి సాగు నీరు కుంటలోకి తరలిస్తే భవిష్యత్‌లో సాగునీటి సమస్య తలెత్తదని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సాగునీరు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు.

గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న కాల్వ సురేశ్ యాదవ్

శంకరపట్నం: గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు నిర్వహించాలని జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాల్వ సురేశ్‌యాదవ్ అన్నారు. మండలంలోని కేశవపట్నంలో మంగళవారం యాదవ, కురుమ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... మండలంలో 18 సొసైటీలుంటే కేవలం ఆరు సంఘాలకు అధికారులు ఎన్నికలు నిర్వహించారని, ఎన్నికల నియమావళి గూర్చి గ్రామాల్లో అధికారులు యాదవ, కురుమ కులస్తులకు అవగాహన కల్పించకపోవడంతో ఎన్నికలకు దూరంగా ఉన్నారని, గ్రామాల్లో నూతన పాలకవర్గాలను ఎన్నుకొని జిల్లాలో ఓటుహక్కు పొందాలని సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ పథకాలు సహకార సంఘాల ద్వారా పొందుతారని, ప్రాథమిక సహకార సంఘం సభ్యులకు అవగాహన కల్పించి ఎన్నికలు నిర్వహించాలని అధికారులను కోరారు. సమావేశంలో తిరుపతి, రవి, కొంరయ్య, కోటయ్య, ఐలయ్య, రాజయ్య, అనిల్, అశోక్, సంపత్, వెంకన్న, కొమురయ్య తదితరులున్నారు.

మిస్సింగ్ కేసు



చిరంజీవి

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బింగి చిరంజీవి (32) మూడు రోజుల నుంచి కనబడటంలేదు. ఈనెల 1న సాయంత్రం వ్యవసాయ బావి వద్దకు వెళ్లొస్తానని ఇంటికి తిరిగి రాలేదు. తల్లి గౌరవ్వ ఫిర్యాదుతో మంగళవారం మిస్సింగ్ కేసు నమోదు చేశామని ఎస్సై బి. రాజేశ్ తెలిపారు. ఆచూకీ తెలిస్తే 8712670772 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్సై కోరారు. కాగా చిరంజీవి టాటా ఏస్ వాహనం నిడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన గీతకార్మికుడు మొలుగూరి రఘుపతి తాటిచెట్టు పైనుంచి పడటంతో తీవ్రగాయాలయ్యాయని గ్రామస్తులు తెలిపారు. మంగళవారం తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తుండగా మోకు జారిపోవడంతో కిందపడ్డాడు. తోటి గీతకార్మికులు 108లో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్: ఎలాంటి విచారణ జరపకుండా పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న కింది స్థాయి అధికారులను విధుల నుంచి తొలగించడం సరికాదని సామాజిక కార్యకర్త అమ్మ వెంకటేశ్‌యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలో మాట్లాడారు. ఆసుపత్రిలోని ఘటనలపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కింది స్థాయి అధికారులను బాధ్యులుగా చేయొద్దని కలెక్టర్ స్పందించి ఆస్పత్రి వ్యవహారంపై విచారణ చేపట్టి సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

కాపర్ వైర్ చోరీ

రామడుగు: మండలంలోని రాంచెంద్రాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీ చేశారు. ఈ మేరకు రామడుగు ట్రాన్స్‌కో ఏఈ కమలేశ్వర్ ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి




జమ్మికుంట: ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

జమ్మికుంట: పట్టణంలో ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని కస్టోడియం ఆఫీసర్ విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. ఈనెల 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు పరీక్ష కేంద్రానికి 30 నిమిషాల ముందు చేరుకోవాలని సూచించారు. పట్టణంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 257, కాకతీయ జూనియర్ కళాశాలలో 303, స్రవంతి జూనియర్ కాలేజీలో 201 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు.

హుజూరాబాద్: పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్, మైనారిటీ గురుకుల పాఠశాల, కాకతీయ జూనియర్ కళాశాలల్లో 777 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు.

గడువు పెంపు



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం మోడల్ స్కూల్ ఆరో తరగతిలో ప్రవేశాలకు 10వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పెంచిందని ప్రిన్స్‌పాల్ సరిత తెలిపారు. అలాగే 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రామకృష్ణ కాలనీ గ్రామానికి చెందిన గోరిటాల సతీశ్ రూ.1.70 లక్షలు వెచ్చించి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. వాటర్ ప్లాంట్‌ను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళారం ప్రారంభించారు. భక్తుల దాహార్తి తీర్చేందుకు ముందుకు వచ్చిన సతీశ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. దాహంతో ఉన్నవారికి మంచినీరు అందించడం గొప్ప పుణ్యకార్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మానకొండూర్: మండలంలోని కొండపల్కల చెరువు మత్తడి వద్ద కొండపల్కల– కెల్లెడ గ్రామాల మధ్య కల్వర్టు ఏర్పాటు చేశారు. ఇసుక ట్రాక్టర్ల రవాణాతో కల్వర్టు ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. ఎటువంటి ప్రమాదం జరగకుండా కల్వర్టు వద్ద తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు, రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
వెంకన్న, పంచాయతీరాజ్ ఏఈ, సెల్ నంబర్: 9440501432

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫోటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

వైభవంగా శంభుస్వామి జాతర



చొప్పదండి: పట్టణ శివారులోని శివకేశవాలయం ఆవరణలో శంభుస్వామి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. వార్షిక ఉత్సవంలో భాగంగా ఉదయం నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మూడు మండలాలకు చెందిన భక్తులు తరలిరావడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం రథయాత్ర చేపట్టారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఆలయ ఆవరణలో దుకాణాలు వెలిశాయి. వివేకానంద యూత్ క్లబ్ సభ్యులు జాతర ఏర్పాట్లు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భజన బృందం సభ్యులు భక్తి గీతాలు ఆలపించారు.

మహిళా దినోత్సవం విజయవంతం చేయండి



అవగాహన కల్పిస్తున్న జిల్లా కార్యదర్శి రమేశ్

జమ్మికుంట: మహిళా దినోత్సవం విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ పిలుపు నిచ్చారు. మండలంలోని వావిలాల పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్‌కు అవగాహన కల్పించారు. మహిళా కార్మికులకు సురక్షిత వాతావరణం కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, మహిళలు హక్కుల సాధన కోసం నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మారెళ్ల శ్రీలత, నాయకులు చెల్పూరి రాము, ఆశా వర్కర్స్ యూనియన్ లీడర్లు సుజాత, స్వప్న, కవిత, కోమల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు





గుండ్లపల్లి స్టేజీ వద్ద స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు, శంకరపట్నం: కేశవపట్నంలో ..

మానకొండూర్: ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపు పట్ల గన్నేరువరం మండల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం గుండ్లపల్లి స్టేజి వద్ద పార్టీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేశ్ ఆధ్వర్యంలో నాయకులు బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా బీజేపీ ప్రభంజనం కొనసాగుతుందన్నారు. ఎన్నికలు ఏవైనా ప్రజలు బీజేపీకి పట్టం గట్టి ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరుస్తున్నారని పేర్కొన్నారు. కొమురయ్య గెలుపుతో ప్రజలు బీజేపీ వైపు ఉన్నారని నిరూపితమైందన్నారు. ఇదే ఒరవడి రాబోయే రోజుల్లో కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రామడుగు: మండల కేంద్రంలో నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పార్టీ మండల అధ్యక్షులు మోడీ రవీందర్ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో మంగళవారం బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అనిల్ ఆధ్వర్యంలో బాణా సంచాకాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

చిగురుమామిడి: మండల కేంద్రంలో నాయకులు సంబరాలు నిర్వహించారు. మండలంలోని ఉపాధ్యాయులు, బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు.

చొప్పదండి: పట్టణంలో బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలోటపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, కిట్టుగౌడ్, మల్లేశం, ప్రశాంత్ పాల్గొన్నారు.



చిగురుమామిడిలో..



రామడుగులో..